క్లుప్తంగా

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు

మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్



బ్లీచింగ్ పౌడర్ చల్లుతున్న కార్మికుడు

కొడంగల్: డెంగ్యూ, మలేరియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందు జాగ్రత్త చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ కమిషనర్ బలరాం నాయక్ చెప్పారు. శుక్రవారం పట్టణంలో డెంగ్యూ జ్వరం నమోదైనట్లు గుర్తించారు. ఈ సందర్భంగా బాధితుల ఇంటి పరిసరాల్లో బ్లీచింగ్ పౌడర్ చల్లించి, రసాయన మందులు పిచికారి చేయించారు. దోమల నుంచి జ్వరాలు వస్తాయని తెలిపారు. దోమలను అరికట్టేందుకు ఇంటి పరిసరాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలన్నారు. అనంతరం బాధిత కుటుంబానికి డాక్టర్ ఫాతిమాతో అవగాహన కల్పించారు.

జెండావిష్కరణ విజయవంతం చేయాలి



ఎమ్మార్పీఎస్ నాయకులతో మహేందర్

దౌల్తాబాద్: ఈ నెల 7న నిర్వహించనున్న అన్ని గ్రామాల్లో ఎమ్మార్పీఎస్ జెండావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ప్రధాన కార్యదర్శి మహేందర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఎమ్మార్పీఎస్ మండల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు ఎమ్మార్పీస్ అలుపెరుగని పోరాటం చేసిందన్నారు.

వివేకానంద స్వామికి నివాళి



స్వామి వివేకానంద విగ్రహానికి నివాళులర్పిస్తున్న బీజేపీ నాయకులు

తాండూరు టౌన్: స్వామి వివేకానంద వర్ధంతిని పురస్కరించుకుని పట్టణంలోని ఆయన విగ్రహానికి బీజేపీ పట్టణాధ్యక్షుడు, పలువురు కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. వివేకానందుడు చూపిన బాటలో యువత పయనించాలని, దేశ ఔన్నత్యాన్ని పెంపొందించాలని పిలుపు నిచ్చారు.

టీబీ రహిత దేశంగా నిలపాలి

టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో డాక్టర్ అక్షయ్ కుమార్



టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో అవగాహన కల్పిస్తున్న వైద్య సిబ్బంది

తాండూరు టౌన్: భారత్‌ను టీబీ రహిత దేశంగా నిలపాలని డాక్టర్ అక్షయ్ కుమార్ పేర్కొన్నారు. శుక్రవారం టీబీ ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా పట్టణంలోని సాయిపూర్ సబ్ సెంటర్‌లో పలువురికి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా డాక్టర్ మాట్లాడుతూ ఎడతెరిపి లేని దగ్గు పలు వారాల పాటు ఉన్నట్‌లైతే వెంటనే వైద్యున్ని సంప్రదించాలన్నారు. ప్రభుత్వం ఆధ్వర్యంలో టీబీ లక్షణాలున్న వారికి ఆరు నెలల పాటు ఉచిత మందులు, నెలకు రూ.1,000 పోషణ కోసం ఇస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు సుధ, స్వప్న, మల్లమ్మ, అంగన్‌వాడీ టీచర్ నవీన, ఆశా కార్యకర్తలు అనిత, సావిత్రి, హేమలత తదితరులు పాల్గొన్నారు.

విద్యాదానం గొప్పది

అనంతగిరి: అన్ని దానాల కెల్లా విద్యాదానం గొప్పదని మాజీ కౌన్సిలర్, బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు గోపాల్ పేర్కొన్నారు. శుక్రవారం మద్గుల్ చిట్టంపల్లి ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు యాలాల్ నర్సిములు ఉద్యోగ విరమణ చేశారు. ఈ సందర్భంగా ఆయనకు సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ముందుగా విద్యార్థులు ఆయనకు పువ్వులు చల్లుతూ స్వాగతం పలికారు. గురువు గొప్పతనాన్ని తెలియజేస్తూ సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. అనంతరం గోపాల్ మాట్లాడుతూ యాలాల్ నర్సిములు చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయుడు విశ్వనాథం, మాజీ ఎంపీటీసీ సాయన్న, స్థానిక నాయకులు పాండు, నర్సింములు, సాయన్న, వెంకటయ్య గౌడ్, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పోలేపల్లిలో వ్యాపారుల దోపిడీ!

ఆలయ పరిసరాల్లో ఇష్టారాజ్యంగా అమ్మకాలు

- ముక్కిన మిక్చర్, కుళ్లిన స్వీట్ల విక్రయం
- చూసీ చూడనట్లు వ్యవహరిస్తున్న ఎండోమెంట్ అధికారులు
- ఇబ్బందులు ఎదుర్కొంటున్న భక్తులు
- పట్టించుకోని అధికారులు



పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయం

దుద్యాల్: మండల పరిధిలోని పోలేపల్లి ఎల్లమ్మ దేవాలయానికి ఓ ప్రత్యేకత సంతరించుకుంది. కోరి నకోర్కెలు తీర్చే అమ్మవారుగా వెలుగొందుతుంది. ఇక్కడ మొక్కులు చెల్లించుకునేందుకు సంవత్సర కాలం పాటు భక్తులు వస్తుంటారు. వారంలో మంగళ, శుక్ర, ఆదివారంతో పాటు ఈ మధ్య కాలంలో బుధవారం కూడా అమ్మవారి దర్శనానికి క్యూ కడుతున్నారు. వారంలో దాదాపు నాలుగు రోజుల పాటు వేల సంఖ్యలో వస్తున్నారు. దాదాపు 5వేల మందికి పైగా దర్శనానికి వస్తారు. ఒక్క వారంలోనే సుమారు 20వేల మంది వరకు దర్శించుకుంటున్నారు. అమ్మవారికి మేకలు, కోడి పుంజులతో మొక్కులు చెల్లించుకుంటారు. దీంతో ఇక్కడ భక్తుల తాకిడి పెరగడంతో వ్యాపారులు కూడా ఇదే అదునుగా భావించి భక్తులను మోసం చేస్తున్నారని చెబుతున్నారు. దేవాలయం చుట్టూ కిరాణ దుకాణల్లో ప్రతీ వస్తువుపై రూ.1 నుంచి రూ. 5 వరకు అదనంగా పెంచి అమ్ముతున్నారు. ఇదేంటని ప్రశ్నిస్తే ఎదురు సమాధానాలు ఇస్తున్నారు. మిక్చర్, స్వీట్ల దుకాణాల్లో కుళ్లిన, ముక్కిన తినుబండారాలను అమ్ముతున్నా పట్టించుకునే వారు లేరు. టెంకాయలు, అమ్మవారి ప్రసాద లడ్లు మాత్రమే వార్షిక టెండర్లో భాగంగా ఉన్నాయి. మిగత ఏ దుకాణం కూడా ఆలయ పరిధిలో లేవని ఈవో రాజేందర్ రెడ్డి తెలిపారు. అధిక ధరలకు వస్తువులు అమ్మకాలు చేపడితే చర్యలు తీసుకుంటామని



నాణ్యత లేని తినుబండారాలను అమ్ముతున్న వ్యాపారులు

ఆయన హెచ్చరిస్తున్నారు.

విచ్చలవిడిగా మద్యం అమ్మకాలు

అమ్మవారి ఆలయం దగ్గర ప్రతి షాప్‌లో మద్యం అమ్మకాలు నిర్వహిస్తున్నారు. మద్యం ఏదైనా సరే ఎమ్మార్పీ ధర కంటే అదనంగా రూ. 20 నుంచి రూ.40 వరకు దండుకుంటున్నారు. అక్కడ ఏమి కొనాలన్న భక్తులు ఇబ్బంది పడుతున్నారు. ఎక్సైజ్ అధికారుల పర్యవేక్షణ కరువైందని భక్తులు వాపోతున్నారు.

కరువైన అధికారుల పర్యవేక్షణ

వారంలో నాలుగు రోజుల పాటు భక్తులు మొక్కులు చెల్లించుకోవడానికి ఇక్కడికి వస్తున్నారు. ఆలయ ఈవో తప్పా ఇతర సంబంధిత అధికారులు ఒక్కరు కూడా పర్యవేక్షించడం లేదు. ఫుడ్ సేఫ్టీ అధికారులు కూడా ఆలయ పరిసర ప్రాంతాల్లోని తినుబండారాల దుకాణాలను తనిఖీలు చేసిన దాఖలాలు లేవు.

అధిక ధరలకు..



అమ్మవారి ఆలయం చుట్టూ ప్రతీ దుకాణంలో ఏ వస్తువు కొనుగోలు చేసిన అధిక ధరలకు అమ్ముతున్నారు. భక్తులను మోసం చేస్తున్నారు. ఈ విషయాన్ని ఎవరికి చెప్పాలో అర్థం కాని పరిస్థితి నెలకొంది. చిన్నచిన్న వస్తువుల నుంచి మద్యం వరకు ధరలు పెంచి అమ్ముతున్నారు. దీని గురించి ప్రశ్నిస్తే అవహేళన చేస్తున్నారు. సంబంధిత అధికారులు తమకేమి పట్టనట్లుగా వ్యవహరించడం బాధాకరం.

– పుట్టి నర్సిములు, భక్తుడు, హైదరాబాద్

చాపలగూడెం పొలాల్లో కొండచిలువ

భయాందోళనకు గురైన రైతులు



కొండ చిలువను పట్టుకున్న స్నేక్ క్యాచర్ ఆజాం తదితరులు

కుల్కచర్ల: చాపలగూడెం గ్రామ పరిసర పొలాల్లో కొండచిలువ సంచారం స్థానిక రైతులను భయాందోళనకు గురిచేసింది. చాపలగూడెం గ్రామ పరిధిలో శావుకు గోవర్ధన్ అనే రైతు పొలాల పరిసరాల్లో కొండచిలువ కనిపించడంతో వారు స్నేక్ క్యాచర్‌కు సమాచారం చేరవేశారు. అక్కడకు చేరుకున్న స్నేక్ క్యాచర్ ఆజాం దాన్ని పట్టుకుని అడవి ప్రాంతంలో విడిచిపెట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుతం వర్షాకాలం కాబట్టి రైతులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇళ్లల్లో, లేదా ఇతర పరిసర ప్రాంతాల్లో ఇబ్బందికరంగా మారిన పరిస్థితుల్లో, పాములు కనిపిస్తే 8374640986 నంబరుపై సంప్రదించాలని సూచించారు.

పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యం



ఏర్పుమళ్లలో ఇందిరమ్మ ఇళ్లకు భూమిపూజ చేస్తున్న వెంకట్రాములుగౌడ్

- మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్
- లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేత

బొంరాస్‌పేట: పేదల సంక్షేమమే కాంగ్రెస్ లక్ష్యమని మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ వెంకట్రాములుగౌడ్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిధిలోని ఏర్పుమళ్లలో ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారులకు ప్రొసీడింగ్ అందజేశారు. ఈ సందర్భంగా ఇళ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. సొంత ఇళ్లు లేని పేదలను గుర్తించి ఉచితంగా రూ.5లక్షల వ్యయంతో కాంగ్రెస్ ప్రభుత్వం నిర్మించి ఇస్తుందన్నారు. వీటిని లబ్ధిదారులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు అంజిల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫార్మర్ రిజిస్ట్రీ చేయించుకోవాలి

చౌడాపూర్ వ్యవసాయ విస్తరణ అధికారి విశ్వనాథ్



రైతుల వివరాలు సేకరిస్తున్న విశ్వనాథ్

కుల్కచర్ల: పొలాలు కలిగిన రైతులు తప్పనిసరిగా రిజిస్ట్రీలో తమ వివరాలను నమోదు చేయించుకోవాలని చౌడాపూర్ వ్యవసాయ విస్తరణ అధికారి విశ్వనాథ్ తెలిపారు. శుక్రవారం చౌడాపూర్ మండల కేంద్రంలో రైతుల వద్ద వివరాలను సేకరించి ఆన్‌లైన్లో నమోదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..2024, డిసెంబర్ 31 వరకు భూ పట్టదారు పాసుపుస్తకం వచ్చిన రైతులందరూ తప్పనిసరిగా వ్యవసాయ విస్తరణ అధికారుల వద్ద తమ పూర్తి వివరాలతో నమోదు చేయించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక రైతులు తదితరులు పాల్గొన్నారు.

ఖర్గే సమావేశానికి తరలిన కాంగ్రెస్ శ్రేణులు

కుల్కచర్ల: హైదరాబాద్‌లోని ఎల్బీ స్టేడియంలో రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న గ్రామ కమిటీ అధ్యక్షులతో నిర్వహిస్తున్న సమావేశానికి శుక్రవారం కుల్కచర్ల, చౌడాపూర్ మండలాల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి కాంగ్రెస్ కార్యకర్తలు, నాయకులు భారీగా తరలివెళ్లారు.

ధారూరులో..

ధారూరు: మండలంలోని వివిధ గ్రామాల నుంచి కాంగ్రెస్ శ్రేణులు తరలివెళ్లారు. మండల అధ్యక్షుడు మాన్‌సింగ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ, ప్రైవేటు బస్సుల్లో మాజీ ప్రజా ప్రతినిధులు, నాయకులు వెళ్లారు.

యాలాలలో..

యాలాల: యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వీరేశం, మత్స్యకార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు శ్రీధర్, అగ్గనూరు మాజీ సర్పంచ్ భీమప్ప, యువ నాయకుడు కలాల్ చంద్రశేఖర్‌గౌడ్ తదితరుల ఆధ్వర్యంలో తరలివెళ్లారు.

పూడూరులో..

పూడూరు: మండల పరిధిలోని కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున తరలివెళ్లారు. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే హాజరవుతున్న నేపథ్యంలో ప్రతి గ్రామం నుంచి ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన బస్సుల్లో వెళ్లారు. ఈ సందర్భంగా పీఏసీఎస్ చైర్మన్ సతీష్‌రెడ్డి, మండల అధ్యక్షుడు సురేందర్ ముదిరాజ్, జిల్లా కార్యవర్గ సభ్యుడు రఘునాథ్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, అజీంపటేల్, శ్రీనివాస్, పెంటయ్య, శకీల్, నాయకులు రమేష్ కుమార్, చెన్నయ్యగౌడ్ తదితరులు తరలివెళ్లారు.

కాంగ్రెస్ ప్రభుత్వంపై నమ్మకం పెరిగింది

దోమ: రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వంపై ప్రజల్లో నమ్మకం పెరిగిందని మండల అధ్యక్షుడు మాలి విజయ్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. ఖర్గేతో ముఖాముఖి కార్యక్రమానికి వెళ్తున్న కార్యకర్తలను జెండా ఊపి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో రాఘవేందర్‌రెడ్డి, బంగ్ల యాదయ్యగౌడ్, ఈడిగి రమేశ్, మొగులయ్యగౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మోమిన్‌పేట: బహిరంగ సభకు మోమిన్‌పేట నుంచి మండల అధ్యక్షుడు శంకర్, మరిపల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలో తరలివెళ్లారు.

అనంతగిరి: ఖర్గే సమావేశానికి వికారాబాద్ మున్సిపల్‌లోని ఆయా వార్డుల నుంచి మండల పరిధిలోని ఆయా గ్రామాల నుంచి కాంగ్రెస్ ముఖ్య నాయకులు భారీగా తరలివెళ్లారు.



దోమ: జెండా ఊపి బస్సును ప్రారంభిస్తున్న మండల కాంగ్రెస్ అధ్యక్షుడు విజయ్‌కుమార్‌రెడ్డి



పూడూరు: మన్నెగూడ నుంచి సభకు తరలివెళ్తున్న నాయకులు



ధారూరు: సభకు బస్సులో వెళ్లడానికి సిద్ధమైన నాయకులు

ఓటు నమోదు తప్పనిసరి

తహసీల్దార్ రవీందర్



మోమిన్‌పేట: మాట్లాడుతున్న తహసీల్దార్ రవీందర్

మోమిన్‌పేట: అర్హులందరూ తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని తహసీల్దార్ రవీందర్ పేర్కొన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో బీఎల్ఓలు, సూపర్‌వైజర్లకు శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 18 సంవత్సరాలు నిండిన ప్రతిఒక్కరూ ఓటు నమోదు చేయించుకోవాలన్నారు. ఇంటింటికి తిరిగి ఓటు నమోదు కాని వారిని గుర్తించి నమోదు చేయాలన్నారు. మృతుల పేర్లను తొలగించాలన్నారు. ఆధార్‌కార్డు జిరాక్స్, పదోతరగతి మార్కుల జాబితా జత పర్చాలన్నారు. ఒక గ్రామం నుంచి ఇంకో గ్రామానికి మార్పిడి కోరితే తగు ఆధారాలతో నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ తహసీల్దార్ సురేశ్‌కుమార్, బీఎల్ఓలు, సూపర్‌వైజర్లు పాల్గొన్నారు.

ఘనంగా రోశయ్య జయంతి

అనంతగిరి: దివంగత ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి, తమిళనాడు, కర్ణాటక మాజీ గవర్నర్‌గా వ్యవహరించిన కొణిజేటి రోశయ్య జయంతిని ఘనంగా నిర్వహించారు. శుక్రవారం రాష్ట్ర ప్రభుత్వం ఆదేశాల మేరకు కలెక్టరేట్ ప్రధాన సమావేశ మందిరంలో యువజన క్రీడల అధికారి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి అదనపు కలెక్టర్ సుధీర్ పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో యువజన క్రీడల అధికారి మహమ్మద్ సత్తార్, విద్యా శాఖాధికారి రేణుకదేవి, జిల్లా పంచాయతీ అధికారి జయసుధ, పలువురు అధికారులు తదితరులు పాల్గొన్నారు.



నివాళులర్పిస్తున్న అదనపు కలెక్టర్ సుధీర్

నష్టపరిహారం అందించాలి

మర్పల్లి: మండల కేంద్రంలో తహసీల్దార్ కార్యాలయం నుంచి పాత బస్టాండ్ వరకు రోడ్డు వెడల్పులో భాగంగా ఇళ్లు కోల్పోతున్న కుటుంబాలకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం చెల్లించాలని పలువురు నాయకులు తహసీల్దార్ పురుషోత్తానికి వినతిపత్రం అందజేశారు. మాజీ జెడ్పీటీసీ మధుకర్, మాజీవైస్ ఎంపీపీ మోహన్‌రెడ్డి, సోహెల్ షరీఫ్, రాజు, గఫార్, గౌస్, రమేశ్, ఖాజా, నవీన్ పాల్గొన్నారు.

కళాశాల విద్యను సద్వినియోగం చేసుకోవాలి



సమావేశంలో మాట్లాడుతున్న రాజేశ్‌రెడ్డి

జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి

బొంరాస్‌పేట: మండల కేంద్రంలో నూతనంగా ఏర్పాటు చేసిన ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ శేరి రాజేశ్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని జూనియర్ కళాశాలలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కళాశాలలో వివిధ రకాల గ్రూపులు, అందిస్తున్న విద్యా సదుపాయాల గురించి చర్చించారు. ఈ కార్యక్రమంలో ఇంటర్ విద్య నోడల్ అధికారి శంకర్‌నాయక్, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్, ఎంఈఓ హరిలాల్, నాయకులు నర్సింలుగౌడ్, రాంచంద్రరెడ్డి, అధ్యాపక బృందం దినేశ్, సురేశ్, శేఖర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య



తాండూరు టౌన్: నివాళులర్పిస్తున్న రాజకీయ, కుల సంఘాల నాయకులు



కొడంగల్: నివాళులర్పిస్తున్న నాయకులు

పలువురి నివాళి

తాండూరు టౌన్: తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలో ఎదురొడ్డి నిలిచి పెత్తందారులను ఎదిరించిన పోరాట యోధుడు దొడ్డి కొమురయ్య అని పలువురు నాయకులు కొనియాడారు. శుక్రవారం దొడ్డి కొమురయ్య వర్ధంతిని పురస్కరించుకుని యశోదనగర్‌లోని ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ పెత్తందారుల కర్కశత్వాన్ని సవాలు చేస్తూ వారికి ఎదురు నిలిచి సాయుధ రైతాంగ పోరాటంలో అసువులు బాసిన తొలి అమరుడు కొమురయ్య అని గుర్తు చేశారు.

కొడంగల్‌లో..

కొడంగల్: పట్టణంలోని అంబేడ్కర్ చౌరస్తాలో నిర్వహించారు. కొమురయ్య చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. సాయుధ రైతాంగ పోరాటంలో కొమురయ్య చూపిన చొరవను గుర్తు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఉడిమేశ్వరం మధు, రమేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

పరిగి: భూమి కోసం భుక్తి కోసం వెట్టి చాకిరి విముక్తి కోసం అనుచిత పోరాటం చేసిన దొడ్డి కొమురయ్య పోరాటం తెలంగాణ ప్రజానికానికి స్ఫూర్తి దాయకమని తెలంగాణ ఉద్యమకారుల ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్, ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర కార్యదర్శి గోవింద్ పేర్కొన్నారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

బీజేపీ ఓబీసీమోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్



లక్ష్మణ్‌ను పుష్పగుచ్ఛం ఇస్తున్న ఈశ్వరప్ప

పరిగి: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని రాజ్యసభ సభ్యులు, బీజేపీ ఓబీసీమోర్చా జాతీయ అధ్యక్షుడు కె లక్ష్మణ్ పేర్కొన్నారు. శుక్రవారం నగరంలోని ఆయన నివాసంలో రాష్ట్ర కార్యదర్శి వెన్న ఈశ్వరప్ప మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా రాజకీయాలపై లక్ష్మణ్ ఆరా తీశారు. వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో పరిగిలో బీజేపీ జెండా ఎగురవేయాలని పేర్కొన్నారు. దీని కోసం ప్రతీ కార్యకర్త కష్టపడి పనిచేయాలన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రతి గ్రామం నుంచి పార్టీ అభ్యర్థులు పోటి చేసేలా చర్యలు తీసుకోవాలని సూచించారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
వెంకటరమణ-9912220528
Md. జకీర్-9573005622